క్లుప్తంగా

నేడు గార్లపాడులో జగనన్న సురక్ష శిబిరం

కాకుమాను: గార్లపాడు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

వీణ లక్ష్మికి సంగీత కళానిధి పురస్కారం



పాత గుంటూరు: గుంటూరుకు చెందిన ప్రముఖ వీణ విద్వాంసురాలు రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ ప్రముఖ దర్శకుడు కోడి రామకృష్ణ సంగీత కళానిధి పురస్కారం అందుకున్నారు. ఆయన జయంతి సందర్భంగా హైద్రాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్మాత రామసత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వాసవీ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో ప్రముఖ సినీ నటులు సుమన్, బాబు మోహన్, కవిత, దివ్యవాణి నుంచి పురస్కారాన్ని రామరాజు లక్ష్మి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను నగరంలోని సాహితీవేత్తలు, కళాభిమానులు అభినందించారు.

వైభవంగా నరనారాయణ జయంతి

తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం అంగరంగ వైభవంగా నరనారాయణ జయంతిని నిర్వహించారు. జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళా శాసనాలతో, అహోబిల రామానుజస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 9 గంటలకు నర నారాయణునికి (శ్రీ కృష్ణుడికి) అభిషేకం, అలంకరణ, అష్టాక్షరీ మహామంత్ర జపం నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని, సాయంత్రం సహస్ర దీపాలంకరణ వైభవంగా ముగిసిందని వివరించారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన, నక్షత్ర తనియన్ విన్నపం, సీతారాముల నిత్య కల్యాణ కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.

స్కిజోఫ్రీనియా రోగులకు పరీక్షలు

గుంటూరు మెడికల్: మానస స్కిజోఫ్రీనియా ఫౌండేషన్ గుంటూరు, ఆంధ్రప్రదేశ్ సైక్రియాట్రి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మానస హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్రియాట్రి సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ స్కిజోఫ్రీనియా బాధితులతో కుటుంబ సభ్యులు ప్రేమతో వ్యవహరించాలని సూచించారు. క్రమం తప్పకుండా రోగులు మందులు వాడేలా చూడాలని తెలిపారు. తాము ప్రతి నెలా నాలుగో ఆదివారం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందుల్ని కూడా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. వైద్య శిబిరంలో సొసైటీ కార్యదర్శి డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ శ్రీరమ్య పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి కోరుతూ ర్యాలీ



పాత గుంటూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడుల్ని అరికట్టి, శాంతిని నెలకొల్పాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనోరంజని కోరారు. సోమవారం ఆమెతో పాటు రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ జోన్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ యం.యస్. విక్రాంత్ వర్ధన్ సంయుక్త ఆధ్వర్యంలో మణిపూర్‌లో క్రైస్తవులపై దాడుల్ని ఖండిస్తూ, బాధితులకు సంఘీభావంగా నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. విక్రాంత్ వర్ధన్ మాట్లాడుతూ దేశంలో క్రైస్తవుల హక్కుల్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. మంగళగిరిలో బాప్టిజం ఘాట్ నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యు.పి.ఎఫ్ ప్రెసిడెంట్ బాలశౌరి, జి.పి.ఎస్. విల్సన్, జి.ఎమ్. రాజు, బిషప్ దేవదాస్, రాఫా ఆడమ్స్, డాక్టర్. ఎ.ఆర్. స్టీవెన్‌సన్, డాక్టర్ జె.కె. వర్ధన్, పాస్టర్స్ పాల్గొని ప్రార్థన చేశారు.

ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోసఫ్ కాలనీలో గొడవర్తి సత్యనారాయణ ఈనెల 27న ఇంటికి తాళాలు వేసి కుటుంబ సమేతంగా ఊరు వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చి చూస్తే తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉంది. అందులోని 11 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో ఆధార్ రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక కౌంటర్

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్‌పై సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగం(ఓపీ)లో ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఓపీ విభాగం వద్ద సోమవారం ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేదవానికీ ప్రభుత్వ పథకాలు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ , ఆసరా పథకాలు రోగుల చెంతకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎం. టి. కృష్ణబాబును ప్రత్యేక నోడల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించినట్లు వెల్లడించారు. జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న వారికి ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. దాన్ని పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డును రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. దీని ద్వారా రోగుల బ్యాంకు ఖాతాలోకి నేరుగా ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయం జమ అవుతుందని వివరించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ షమీనా బేగం, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అదనంగా ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాలు

రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అవుట్ పేషెంట్ విభాగంలో అదనంగా పది ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను ప్రారంభిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఓపీ విభాగాన్ని పరిశీలించారు. పేర్లు నమోదు చేసుకునే కౌంటర్ వద్ద రోగులు అధిక సంఖ్యలో ఉండటం గమనించి తక్షణమే అదనంగా ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాల్ని ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు చేశారు.

దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కు ప్రత్యేక ఓపీ

జీజీహెచ్‌లో దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కు త్వరలోనే ప్రత్యేక ఓపీ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం సూపరింటెండెంట్ కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల చట్టం పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌కుమార్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ ఎదుర్కొంటున్న సమస్యల్ని బందెల కిరణ్‌కుమార్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక ఓపీ వైద్య విభాగాన్ని వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయడమే గాకుండా వైద్యుడిని నియమించాలని సివిల్‌సర్జన్ ఆర్ఎంఓకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జీజీహెచ్‌లో దివ్యాంగుల కోసం ర్యాంపును కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అర్ధరాత్రి క్యాజువాల్టీలో తనిఖీలు

సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆదివారం అర్ధరాత్రి క్యాజువాల్టిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. క్యాజువాల్టీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని నలుగురు వైద్యులకు ఫోన్లు చేసి తక్షణమే రావాలని ఆదేశించారు.

మహనీయుల అడుగుజాడల్లో నడుచుకోవాలి



జాషువా చిత్రపటానికి ఉపాధ్యాయుల నివాళి

పెదకాకాని: నేటి యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, మంచి మార్గంలో నడుచుకోవాలని ప్రాథమిక పాఠశాల (ఎల్ఈ)స్కూల్ హెచ్ఎం ఆనందరావు అన్నారు. పెదకాకాని లూధర్‌గిరి కాలనీలో సోమవారం గ్రంథాలయ అధికారి వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు 'అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి, గుర్రం జాషువా 50 వర్ధంతి పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్ఎం ఆనందరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యవతి విచ్చేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయోద్యమకారుడని, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులని తెలిపారు. పత్రికా సంపాదకులుగా గ్రంథాలయ సర్వస్వము అనే పత్రికను నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగలక్ష్మి , జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

'ముదు ఘంటికలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య, రచయిత సుధాకర్‌రెడ్డి

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలో తెలంగాణ జనసత్తా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి రచించిన ''ముదు ఘంటికలు'' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ''ముదు ఘంటికలు'' పుస్తకం సామాజిక చైతన్యానికి, వికాసానికి చైతన్య కరదీపికగా నిలుస్తుందన్నారు. ప్రతి పౌరుడు చైతన్యవంతుడై ప్రశ్నించే తత్వం, జవాబుదారీతనం అవరుచుకుని, దేశ సౌభాగ్య సాధానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. పుస్తక రచయిత ముదుగంటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిని, అక్రమాలను ఎదురించడమే తన లక్ష్యంగా పుస్తకాన్ని అందించినట్లు తెలిపారు.

ఫిజియోథెరపీకి ఉజ్వల భవిష్యత్తు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

గుంటూరు మెడికల్: మనిషి ఆధునిక జీవన శైలికను గుణంగా ఫిజియోథెరపీ విద్య నూతనత్వం సంతరించుకుంటోందని, విదేశాలతో పాటు దేశీయంగా విద్య, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని రామచంద్ర చిన్న పిల్లల వైద్యశాల వ్యవస్థాపకుడు డాక్టర్ టి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అరండల్‌పేటలో సోమవారం హారిక ఫిజియోథెరపీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ టి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఫిజియోథెరపీకి ప్రజల్లో నానాటికి అవగాహన పెరుగుతోందన్నారు. అన్ని వ్యాధులకు చికిత్సకు ముందు చికిత్స తర్వాత ఫిజియోథెరపీ వైద్యుల అవసరం పెరుగుతున్నట్లు వెల్లడించారు. గర్భం నుంచి సమాధి స్థితి వరకు అనేక దశల్లో ఫిజియోథెరపీ వైద్యంతో మనిషికి అవసరం పెరిగిందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సుభాని మాట్లాడుతూ దశాబ్దంగా నాణ్యమైన డిగ్రీ, డిప్లొమా కోర్సులకు హారిక ఫిజియోథెరపీ కళాశాల చిరునామాగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ షేక్ మహీనా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, అధ్యాపకులు డాక్టర్ సామ్యూల్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ పుష్పలత, షేక్ మస్తానమ్మ పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం

అదనపు కమిషనర్ పెద్ది రోజా



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం యాక్షన్ ప్లాన్‌ను సచివాలయాల వారీగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులకు ఇచ్చే సమాధానాన్ని ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని అధికారుల్ని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ముందు తర్వాత ఫోటోలు జత చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 28 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 10, ఇంజినీరింగ్ విభాగానికి- 9, రెవెన్యూ విభాగానికి- 5, ప్రజారోగ్య విభాగానికి- 2, పరిపాలన విభాగానికి- 2 చొప్పున ఫిర్యాదులు అందాయని ఆమె వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, రవీంద్ర, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణానికి చెందిన యువకుడు ఏసుదాసుపై ఇటీవల కొందరు యువకులు దాడి చేశారు. దాడి చేసిన సమయంలో చొప్పవరపు వెంకటేష్ అక్కడే ఉన్నాడు. ఇది మనసులో పెట్టుకున్న ఏసుదాసు తన మిత్రులు భరత్, నానలతో కలిసి వెంకటేష్‌పై సోమవారం దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిఅర్బన్: కేరళ వసంతలక్ష్మి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని వారి తండ్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు పాదర్తి వెంకటేశ్వరరావు సహకారంతో నాజరుపేటలోని మనఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, పాదర్తి ఆదిలక్ష్మి, క్లబ్ సభ్యులు కోనిజేటి రమేష్ కృష్ణ, అయినాల మల్లేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు చుండూరు భారతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి, ఉజ్వల భవిష్యత్తు కల్పించటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో వివిధ బహుళ జాతీయ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 47 మంది ఎంబీఏ విద్యార్థులు అధిక ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,208 మంది విద్యార్థులు ఉద్యోగాలను పొందటం సంతోషకరమన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎంబీఏలో ఆధునిక టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెట్టడంతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సులభతరమవుతున్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. కళాశాల అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ శ్రీకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, వి.జగదీశ్, ఇన్‌చార్జి చక్రధర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

జాతీయస్థాయి కర్రసాము పోటీలకు విద్యార్థుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి కర్రసాము పోటీలకు మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.వి. సెబాస్టియన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీ సిలంబమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో భాగంగా అండర్-14 బాలికల విభాగంలో వి. హంసిని మీనాక్షి, బాలుర విభాగంలో వి. వైదిక్ సాదిత్య బంగారు పతకాల్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని ఆయన సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ మాట్లాడుతూ కర్రసాము శిక్షణతో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కోచ్‌ను అభినందించారు.

వైద్యశాలలో మదర్ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ ఇంటర్నేషల్ అధ్యక్షురాలు గాయత్రీ

తెనాలిఅర్బన్: వాసవీ క్లబ్, తెనాలిటౌన్ ఇస్కాన్ వారి సంయుక్త సహకారంతో పాత ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ (పిల్లలకు పాలు ఇచ్చు గది)ని సోమవారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రీ ప్రారంభించారు. అనంతరం నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీజాన్, గోనుగుంట్ల జయంత్, జె.శ్రీనివాస్, బి.బ్రహ్మప్రసాద్, ఎస్.లక్ష్మీ నరసింహామూర్తి పాల్గొన్నారు.

30న మిర్చి యార్డు పాలకవర్గం ప్రమాణం

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అంబటి రాంబాబు



మిర్చి యార్డు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అంబటి, జిల్లా అధ్యక్షుడు డొక్కా

నగరంపాలెం: మిర్చి యార్డులో పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పరిశీలించారు. సభ నిర్వహణ కోసం విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంతో పాటు రైతు సమాచార కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చైర్మన్ కార్యాలయంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి, కొత్త పాలకవర్గం, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ 30న పెద్దఎత్తున జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, విడదల రజిని, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ యార్డుని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. నిరంతరం రైతుల పక్షాన నిలిచేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ యార్డు నుంచి అత్యధిక శాతం మిర్చి విదేశాలకు దిగుమతి అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, మిర్చి యార్డు నూతన చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, జీఎంసీ డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

వీవీఐటీలో డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ పై సదస్సు



ఎంవీ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా భారత్ ఎలక్ట్రానిక్స్ పరిశోధన విభాగం మాజీ డైరెక్టర్ ఎంవీ రాజశేఖర్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగంలో యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. డ్యూయల్ బ్యాండ్ సర్వేలయన్స్ రాడార్ పనితీరు, రాడార్ ట్రాపింగ్, బ్యాటిల్ ఫీల్డ్ సర్వేలయన్స్ రాడార్, క్షిపణులు పనిచేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎంవీ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్ బసవబాబు

చేబ్రోలు: జిల్లా స్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీలలో చేబ్రోలులోని ప్రెసిడెన్సీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ నాగూర్ మీరావలి సోమవారం తెలిపారు. పాత్తూరులోని ఏసీఎంఈ స్కూల్‌లో శనివారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. అండర్-8, అండర్-10, అండర్-12 విభాగాల్లో పోటీలు జరిగాయి. అండర్-10 విభాగంలో ప్రెసిడెన్సీ స్కూల్‌కు చెందిన కారుమూరి సందీప్ ఈపీఈఈలో గోల్డ్ మెడల్ సాధించాడు. సబ్రే మ్యాచ్‌లో షేక్ అబ్దుల్ ఖాదర్ గోల్డ్ మెడల్, నూనె యశ్విన్ బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్-12 విభాగంలో షేక్ ఇంతియాజ్ గోల్డ్ మెడల్, హర్షవర్ధన్ బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి బసవబాబు, ప్రిన్సిపల్ ఆశాలత, ఉపాధ్యాయులు అభినందించారు.

నవయుగ కవి చక్రవర్తి జాషువా



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నెహ్రూనగర్: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని దళిత ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. గుర్రం జాషువా 52వ వర్ధంతిని పురస్కరించుకుని నగరంపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవి కోకిల గుర్రం జాషువా తన బాల్యం నుంచే గ్రామంలో అసమానతల్ని చవిచూసి తన అక్షరం ద్వారా తెలుగుజాతిని నిదురలేపిన మహనీయుడని కొనియాడారు. అసమానతల సమాజాన్ని రూపుమాపేందుకు, రచనల ద్వారా తన జాతి అనుభవిస్తున్న బాధల్ని గబ్బిలం ద్వారా శివుడికి సందేశం పంపిన మహాకవి గుర్రం జాషువా అని పేర్కొన్నారు. ఆయన సామూహిక వివాహాల్ని ప్రోత్సహించి, తద్వారా అసమానతల్ని రూపుమాపడానికి కృషి చేశారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం తన కవితల ద్వారా కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఐజీ స్టాంపు రిజిస్ట్రేషన్ బాలస్వామి, భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ , బీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, ప్రజా గాయకుడు పి.వి. రమణ, నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

తన కవితాలనే ఆయుధంగా చేసుకుని సమాజాన్ని జాగృతం చేసిన గొప్ప కవి గుర్రం జాషువా అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు తెలిపారు. జాషువా వర్ధంతిని పురస్కరించుకుని నగరంపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవుల్లో అగ్రగణ్యులైన జాషువా సామాజిక ప్రయోజనం కోసం తన రచనలు కొనసాగించారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అబ్రహాం , రమేష్, సురేష్, సుబ్బయ్య, పూర్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉప్పల నారాయణస్వామి సతీమణి మంజులవాణి జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ మండలం అంగలకుదురులో గల ముక్తి ట్రైబల్ రెసిడెన్స్ స్కూలులో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేశారు. హ్యాపీ హాస్పటల్స్ డాక్టర్ పావనీ ప్రియాంక, రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కొణిజేటి మురళి, కృష్ణకుమార్, ముక్తి స్కూల్ ఫాదర్ జయపాల్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, పూజిత, సతీష్, నందు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన

తెనాలి: ఏఐఎస్ఎఫ్, తెనాలి నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఈనెల 25న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు సంఘీభావంగా ఈ ప్రదర్శన చేశారు. విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యం సహకరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, మద్దినేని కిరణ్‌బాబు కోరారు. పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్, కావేటి యశ్వంత్, తలతోటి శ్రీను, వివ, వినయ్, కుప్పం సాయిప్రదీప్ పాల్గొన్నారు.